## మల్కాపురంలో ఏ.ఐ.టి.యు.సి ముఖ్య నాయకులు సమావేశము



**ప్రజా న్యూస్. విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీఎం నాయుడు ఆగస్ట్. 03 :** కోరమండల్ కంపెనీలో కార్మిక విచ్ఛిన్న చర్యలను తిప్పి కొట్టడానికి కార్మిక ఐక్యతను కాపాడుకోడానికి భాగముగా సోమవారం ఉదయం 10 గంటలకు మల్కాపురం గ్రామ మండలిలో ఏఐటియుసి మీడియా మరియు పత్రికా విలేకరుల సమావేశము నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి అధ్యక్షత గుడాల రాంబాబు వహించారు ఈ సమావేశంలో ముందుగా ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కాంద్రేగుల సత్యాంజనేయ మరియు కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ 1986లో ఏఐటీయూసీ నాయకత్వంలో కామ్రేడ్ మానం ఆంజనేయులు కోరమండల్ వేస్ అగ్రిమెంట్ కోసం ఎనిమిది రోజులు నిరాహార దీక్ష చేశారు అనంతరం 2010లో కామ్రేడ్ జీవి సత్యనారాయణమూర్తి ఎనిమిది రోజులు పాటు నిరువదిక నిరాహార దీక్షకు దిగి వేస్ అగ్రిమెంట్ జరిపించారు ఇలా ప్రాణాలను కూడా లెక్క చేయని ఏఐటీయూసీ నాయకత్వం కారణంగా సరైన సమయానికి కార్మికుల వేతనాల పెంపు ఉద్యోగ భద్రత సంక్షేమ సౌకర్యాలు చట్టబద్ధహక్కుల పరిరక్షణలో కార్మికుల విశ్వాసాన్ని గెలుచుకుంది నేడు కొందరు తామే ఒక్కరే కార్మికుల కోసం పోరాడినట్లు మిగిలిన కార్మిక సంఘాలకు ఎలాంటి పాత్ర లేదన్నట్లుగా ప్రచారం చేస్తున్నారు ఇది వాస్తవ చరిత్రకు విరుద్ధమే కార్మిక ఐక్యతను బలహీనపరిచే ప్రయత్నం ఈ అసత్య ప్రచారాలు చేస్తున్నారు దీనివలన కార్మికులకు నష్టం చేకూరుతుంది ఇప్పటికైనా కార్మిక ఒప్పంద సంక్షేమానికి సమస్యలు పరిష్కారానికి కార్మిక సంఘాలు అన్ని ఏకతాటిపైకి వచ్చి కృషి చేయాలి లేకపోతే శాశ్వత ఉద్యోగాలు తగ్గుతాయి కాంట్రాక్టు కర్మ పెరుగుతాది అని కొన్ని కార్మిక సంఘాలను హెచ్చరించారు ఈ ప్రెస్ మీట్ లో పాల్గొన్న ది విశాఖపట్నం కాంటాక్ట్ లేబర్ యూనియన్ కోరమండల్ నాయకులు సుక్కా సత్యనారాయణ కోలేటి శంకర్రావు మహాలక్ష్మి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధి దేయ్యం ప్రజా సేవే లక్ష్యంగా ముందుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీ కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 3 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం సర్కిల్, మహాదేవపురం డివిజన్‌లోని బతుకమ్మ బండ ప్రాంతంలో రూ.80 లక్షల వ్యయంతో, అలాగే కైసర్ నగర్‌లో రూ.1.20 కోట్ల వ్యయంతో మంజూరైన మొత్తం 2 కోట్ల విలువైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మొట్టమొదటి ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక బస్తీ వాసులు రోడ్ల సౌకర్యం లేకపోవడంతో ప్రతి వర్షాకాలంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని ఆయన విమర్శించారు. ప్రస్తుతం గెలిచిన ఎమ్మెల్యే హ్యాట్రిక్ ఎమ్మెల్యే అని చెప్పుకుంటూ సోషల్ మీడియాలో యాక్టింగ్ చేయడం తప్ప అభివృద్ధిపై దృష్టి సాధించకుండా ఎంతసేపు ప్రభుత్వం వద్ద నిధులు లేవంటూ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు, ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో సహకరించిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి , మంత్రి శ్రీధర్ బాబు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు, ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఉచిత విద్యుత్తు,ఉచిత బస్సు, సన్న బియ్యం,వంటి పథకాలను ప్రభుత్వం అమలు పరుస్తుందని తెలిపారు, రామన్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి మరింత అభివృద్ధికి దోహతపడాలని స్థానికులను ఉద్దేశించి ప్రసంగించారుఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ తో పాటు స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, తోసిఫ్, పూలమ్మ,ప్రసాద్,నరేందర్ రెడ్డి, జమీల్ పాషా పరమేశ్వర్ పంతులు, సంగయ్య, మహేష్ రెడ్డి రాములు,జబ్బర్,రసూల్ ముక్తార్ భవానీ ,సలీం,తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న శంభీపూర్ క్రిష్ణ



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 3 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం డి.పోచంపల్లికి నివాసులు బొంగునూరి విష్ణువర్ధన్ రెడ్డి నిర్వహించిన నోట్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నోట్‌బుక్‌ల పంపిణీ ద్వారా విద్యార్థులకు అండగా నిలిచేందుకు బొంగునూరు విష్ణువర్ధన్ రెడ్డి చేపట్టిన ఈ మంచి కార్యక్రమాన్ని అభినందించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, దృఢ సంకల్పంతో చదువును కొనసాగించేలా ప్రోత్సహించడంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఉజ్వల భవిష్యత్తుకు విద్యే పునాది అని తెలిపారు. విద్యార్థులు అంకితభావంతో చదువుకోవాలని, తమకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు అమరం గోపాల్ రెడ్డి, జక్కుల శ్రీనివాస్ యాదవ్, కోల సాయి యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ దుండిగల్ సర్కిల్ జనరల్ సెక్రెటరీ కోల్తుర్ మల్లేష్ ముదిరాజ్, ఎక్స్ వైస్ చైర్మన్ నల్తూరి క్రిష్ణ, నాయకులు బిక్షపతి గౌడ్, ఈ శ్రీనివాస్, దార మహేష్, పలువురు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తేటగుంటలో తక్కువ ధర బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య



**తుని, ఆగస్టు 3 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తుని మండలం తేటగుంటలో తక్కువ ధరకు బియ్యం విక్రయ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వ విప్ యనమల దివ్య ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని తహసీల్దార్ గిడుతూరి ప్రసాదరావుతో కలిసి తెలుగు దేశం పార్టీ నేత యనమల రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు చింతనీడి అబ్బాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా సంక్షేమ కార్యక్రమాలను కార్యరూపంలో అమలు చేస్తోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంతో పాటు సామాన్య ప్రజలకు సరసమైన ధరలకు బియ్యం అందించేందుకు ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతు బజార్లతో పాటు బియ్యం మిల్లుల వద్ద కూడా ఇలాంటి విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి తక్కువ ధరకే బియ్యం అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పేదల సంక్షేమం, జీవన వ్యయ భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో పోతల రాంబాబు, గజ్జి రాంబాబు, కొల్లు సత్యనారాయణ, చామంతి సత్తిబాబు, అత్తి అచ్యుతరావు, కాపారపు అబ్బులు తదితరులు పాల్గొన్నారు.






## ఎన్నికలు ఏవైనా విజయం వైసిపిదే..

### డైనమిక్ లీడర్ "వాసుపల్లి" గణేష్ కుమార్



**ప్రజా న్యూస్. విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీఎం.నాయుడు ఆగస్టు. 03 :** ఆదర్శనీయమైన నాయకత్వాల లక్షణాలు కలిగిన డేరింగ్ అండ్ డైనమిక్ లీడర్ తమ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అని దక్షిణ నియోజకవర్గ నాయి బ్రాహ్మణ అధ్యక్షులు వీరేశ్వరపు త్రినాధరావు కొనియాడారు. వాసుపల్లి చొరవతో నూతనంగా ఎన్నికైన నాయి బ్రాహ్మణ సభ్యులు ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసుపల్లి గణేష్ కుమార్ తమకి సముచిత స్థానం కల్పించారన్నారు. ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పార్టీ అభివృద్ధికి, అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలో అలుపెరగని పోరాటం చేయడంలో నైనా, పేద ప్రజలకు గుప్త దానాలు చేయడం లో నైనా అతనికి సరిలేరన్నారు. ఇటు ప్రజలను మరోపక్క క్యాడర్ కు అండగా నిలవడంలో వాసుపల్లి గణేష్ కుమార్ ఆదర్శనీయులు అన్నారు. 2029 ఎన్నికల్లో కచ్చితంగా తమ నాయకుడు వాసుపల్లి గణేష్ కుమార్ ను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుని వైఎస్ఆర్సిపి ని అధికారంలో తీసుకురావడంలో తమ వంతు బాధ్యతగా పనిచేస్తామని తెలిపారు. అనంతరం వాసుపల్లి గణేష్ కుమార్ వారిని అభినందించారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీ అన్య విధాల సహాయ సహకారాలు అందిస్తూ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించడంలో జగన్మోహన్ రెడ్డి రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ఈసారి ఏ ఎన్నికలైనా విజయం వైసీపీ దేనని వాసుపల్లి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, మాజీ కార్పొరేటర్ తోట పద్మావతి, ఆరిపాక పెంటరావు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, వెంపటాపు నూకరాజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కె. వెంకట్రావు రాష్ట్ర కార్యదర్శి, కే సూర్యారావు విశాఖ జిల్లా వైఎస్ఆర్సిపి నాయి బ్రాహ్మణ విభాగం అధ్యక్షులు,టీ.చిన్న,వన్ టౌన్ ప్రధాన కార్యదర్శి,కే లక్ష్మణరావు, కోశాధికారి,ఎస్ కే శ్రీ రాములు, కళాకారుల అధ్యక్షులు,యు. శ్రీను. టి జగన్, టి.సాయి,ఎస్ రాజు, జి నారాయణరావు,పి శ్రీను, ఎస్ శ్రీను, టి సూరిబాబు, జి శ్రీను, కే బుచ్చిరాజు, జి రమణ,పి గోవిందు, ఆర్ శివ, కే మహేష్, దుర్గారావు భరత్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదపు అంచున సంగం పాత బ్రిడ్జి



**సంగం ఆగష్టు 3 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :** సంగం బ్యారేజ్ సమీపంలోని పాత బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. సంగం––చేజర్ల ప్రాంతాల మధ్య ప్రధాన రాకపోకల మార్గంగా ఉన్న ఈ వంతెనపై ప్రతిరోజూ ధాన్యం లారీలు, ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.వంతెన పలు చోట్ల దెబ్బతినడం కాలక్రమేణా బలహీనపడటం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న భయంతో ప్రజలు ప్రయాణిస్తున్నారు ముఖ్యంగా పాఠశాలలు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు ఈ మార్గాన్నే ఎక్కువగా వినియోగిస్తుండటంతో వారి ఆందోళన మరింత పెరిగింది.భారీ వాహనాలు వంతెనపై నుంచి వెళ్లే సమయంలో కంపిస్తున్నట్లు అనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏదైనా దుర్ఘటన జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అధికారులు వంతెనను పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, అవసరమైతే కొత్త బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలు అత్యవసర చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో మెరిసిన వి.వి.ఎస్. పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

- హర్ష, అశ్విత్‌లకు బంగారు పతకాలు



**జగద్గిరిగుట్ట, ఆగస్టు 3 (ప్రజా న్యూస్ నెట్వర్క్):** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, జగద్గిరిగుట్టలోని వి.వి.ఎస్. పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ వేదికపై తమ ప్రతిభను చాటుతూ పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న హర్ష, అశ్విత్‌లు ఎల్.బి. నగర్‌లోని లక్ష్మీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 2వ అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్–2026లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాల నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.పాఠశాల అధ్యక్షుడు వెంకటస్వామి విజేతలను అభినందిస్తూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధే తమ విద్యాసంస్థ ప్రధాన లక్ష్యమని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించేలా విద్యార్థులకు అవసరమైన శిక్షణ, ప్రోత్సాహం, ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు యాజమాన్యం కట్టుబడి ఉందని తెలిపారు.విద్యార్థుల ఈ విశిష్ట విజయంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సహ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ హర్ష, అశ్విత్‌లను అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించడం ద్వారా వి.వి.ఎస్. పబ్లిక్ స్కూల్‌కు మరోసారి విశిష్ట గుర్తింపు లభించిందని పేర్కొన్నారు.

## చింతకుంట్లలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు వేగవంతం చేయాలి



**కొండమల్లేపల్లి, ఆగస్టు 3, ప్రజా న్యూస్ నెట్వర్క్:** చింతకుంట్ల గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములను పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్ఓ)ను కోరారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, సోమవారం దినపత్రికలో ప్రచురితమైన భూకబ్జాలకు సంబంధించిన వార్తపై ఎంఆర్ఓ వెంటనే స్పందించడం అభినందనీయమని తెలిపారు.గ్రామంలోని ప్రభుత్వ సర్వే నెం. లో ఉన్న అన్ని ప్రభుత్వ భూమికి సంబంధించిన రికార్డులను పూర్తిగా పరిశీలించి, ఆ భూమికి వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆస్తిని శాశ్వతంగా రక్షించాలని వారు విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా, చింతకుంట్ల గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని ప్రభుత్వ సర్వే నంబర్ల భూములను సమగ్రంగా సర్వే చేసి, ప్రభుత్వ భూములతో పాటు అసైన్డ్ భూములను కూడా కబ్జాల బారిన పడకుండా రక్షించాలని కోరారు. ఎవరైనా అక్రమంగా ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములను ఆక్రమించి సాగు చేస్తున్నట్లు గుర్తిస్తే వాటిని వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని, ఆయా భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి శాశ్వత రక్షణ కల్పించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు.ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూములు, పేదలకు కేటాయించిన అసైన్డ్ భూములు భవిష్యత్ తరాలకు సురక్షితంగా ఉండేలా రెవెన్యూ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: పస్కుల శ్రీను, సేవా మధర్, కొప్పుల్ శివ, మేకుల వినోద్, కలగోని రమేష్, చింతకుంట్ల గ్రామ ఉపసర్పంచ్ దాసరి బాలకృష్ణ, మాధగోని అంజి, పంది నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో చైతన్యానికి 'టీమ్ రక్ష' శ్రీకారం

### విద్యార్థుల్లో చైతన్యానికి 'టీమ్ రక్ష' శ్రీకారం



**తుని, ఆగస్టు 3 ప్రజా న్యూస్ నెట్వర్క్:** నేటి తరం విద్యార్థులను డ్రగ్స్, మొబైల్ వ్యసనం, ఆన్‌లైన్ బెట్టింగ్, ఈవ్ టీజింగ్, నిర్లక్ష్య వాహనచోదనం వంటి సామాజిక దురలవాట్ల నుంచి దూరంగా ఉంచి చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతో 'టీమ్ రక్ష––ఫేజ్––1' అవగాహన కార్యక్రమాన్ని సోమవారం తుని రోటరీ ఫంక్షన్ హాల్‌లో ప్రారంభించారు. తొలి విడతలో భాగంగా శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల తుని క్యాంపస్‌కు చెందిన నాలుగో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న 320 మంది విద్యార్థినులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా టీమ్ రక్ష ప్రాజెక్టు చైర్మన్ కె. కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అన్ని అంశాలను ఒకేసారి వివరించడం సాధ్యం కానందున దశలవారీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి విడతలో బాలికలకు 'మంచి స్పర్శ––చెడు స్పర్శ'పై అవగాహన కల్పించడంతో పాటు, మొబైల్ వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించడం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. తుని, పాయకరావుపేట పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఈ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సి.హెచ్. విజయ్ ప్రకాష్ హాజరై కార్యక్రమానికి అనుమతి తెలిపారు. విశిష్ట అతిథిగా శర్మ మాస్టారు పాల్గొన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ వక్త సుమ భ్రమరాంబ విద్యార్థినులకు అవగాహన కల్పించగా, డి.వి. రాజు, మంగపతి రాజు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో టీమ్ రక్ష కో–చైర్మన్ సి.హెచ్. మంగరాజు, రోటరీ అధ్యక్షుడు బి. జగదీష్, ఖజాంచి కె. ఈశ్వర్ గణేష్, డి. మధుసూదన్, సి.హెచ్. రామకృష్ణ, టి. దేవి వరప్రసాద్, ఎన్. వీర్రాజు, ఎం.వి. రాజారెడ్డి, వి.ఎస్. వినయ్, ఎం. వివేకానంద్, డి.వి. రాజు, డా. పి. ప్రసాద్, కే. కృష్ణ, కే. కార్తీక్, బి. లోకేష్, సాయి తేజ, ఎస్. రామచంద్రరావు, కృతిక, అజార్, జి. సాయి చంద్రశేఖర్, పి.ఎల్.ఎస్. మూర్తి, సి.హెచ్. సుజాత, డి. సత్యసాయి, జె. రామకృష్ణతో పాటు రోటరీ, రోటరాక్ట్ సభ్యులు, శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

## పీఏపల్లిలో ఘనంగా ప్రారంభమైన శ్రీ రాఘవేంద్ర ట్రేడర్స్

-ముఖ్య అతిథిగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.బి. రాథోడ్



**పీఏ పల్లి, ఆగస్టు 3, ప్రజా న్యూస్ నెట్వర్క్:** పీఏపల్లి గ్రామంలో నూతనం గా ఏర్పాటు చేసిన శ్రీ రాఘవేంద్ర ట్రేడర్స్ దుకాణాన్ని ఎన్‌హెచ్ ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.బి. రాథోడ్ సోమవారం ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆర్.బి. రాథోడ్ మాట్లాడుతూ వ్యాపారంలో నాణ్యత,నిజాయితీ,వినియోగదారుల నమ్మకమే విజయానికి పునాదని అన్నారు.వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా వ్యాపారాన్ని నిర్వహిస్తే అభివృద్ధి సహజంగానే వస్తుందని పేర్కొన్నారు.ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యుడు హరిప్రసాద్ ఆర్.బి.రాథోడ్‌తో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పాషాలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం ఆర్.బి.రాథోడ్, సయ్యద్ గౌస్ పాషా హరిప్రసాద్‌ను శాలువాతో సత్కరించి, వ్యాపార అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.అలాగే యువత ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా, స్వయం ఉపాధి మరియు వ్యాపార రంగంలో రాణించి ఆత్మనిర్భరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హరిప్రసాద్ కుటుంబ సభ్యులు, చిలుకూరి మహేందర్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు బండి నరేష్, తడక మల్ల బిక్షమయ్య, గార్లపాటి శ్రీను, అల్తాఫ్, ఓర్సు వెంకటేష్, ఇబ్రహీం, వెంకటేష్, మహేందర్, వెంకటయ్యతో పాటు నాగార్జున, నాగేష్, అనిల్, అజయ్, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంజి ఎలక్ట్రికల్ స్కూటీ షాప్‌ను ప్రారంభించిన మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ, ఆగస్టు 3, ప్రజా న్యూస్ నెట్వర్క్:** దేవరకొండ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంజి ఎలక్ట్రికల్ స్కూటీ షాప్‌ను దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రారంభించారు.షాప్ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం రోజురోజుకు పెరుగుతోందని అన్నారు. ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో ఎలక్ట్రిక్ స్కూటీలు ప్రజలకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉండటమే కాకుండా,కాలుష్యాన్ని తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.దేవరకొండలో ఇటువంటి ఆధునిక సేవలు అందుబాటులోకి రావడం స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి, వ్యాపార రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పొట్ట మురళి, పొట్ట మధు, సర్పంచ్ ఆడారపు హరిక్రిష్ణ,బొడ్డుపల్లి కృష్ణ ,ఇలియాస్ పటేల్,మాడం రాములు, ముదిగొండ హరిదాస్, అఫ్రోజ్,అంజి,శ్రీనివాస్,యజమానులు గందూరి లక్ష్మణ్,సాగర్,పార్టీ నాయకులు యువకులు పాల్గొన్నారు.

## గడ్డివాము అగ్నికి ఆహుతి.. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జయవీర్ ఆర్థిక సాయం



**నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 3 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు ధర్మారపు వెంకన్న––సైదమ్మ కుటుంబానికి చెందిన గడ్డివాము అగ్నికి ఆహుతైన ఘటనపై నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఘటనకు సంబంధించిన విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే బాధిత కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వారికి అండగా నిలవాలని నిర్ణయించారు. ఈ మేరకు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. అకస్మాత్తుగా జరిగిన అగ్ని ప్రమాదంతో నష్టపోయిన కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం కొంతమేర ఉపశమనంగా నిలుస్తుందని స్థానికులు పేర్కొన్నారు. ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు వెంటనే స్పందించి సహాయం అందించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని, బాధిత కుటుంబానికి అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే తక్షణ స్పందనపై బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## సారా తరలింపుపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం ద్విచక్ర వాహనం సీజ్.. 8 లీటర్ల సారా స్వాధీనం



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 3 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** హుజూర్ నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి లో అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. మఠంపల్లి మండలం బడవ తండా గ్రామానికి చెందిన బానోత్ రంగా అనే వ్యక్తి తన బజాజ్ సిటీ––100 ద్విచక్ర వాహనంపై సారాను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎక్సైజ్ అధికారి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో వాహనాన్ని సీజ్ చేసి, అందులో ఉన్న 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సారా తరలింపునకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిపై ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అక్రమ మద్యం, సారా తయారీ, నిల్వ, రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది ప్రభాకర్, గోపిరెడ్డి పాల్గొన్నారు.

# కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని ఇష్టంగా మింగారా..?

## సీఎంఆర్ అక్రమాల్లో వందల కోట్ల ప్రజాధనం స్వాహా అయినట్టేనా..?

## కేసులు అంటే లెక్కలేదు.. జైలుకు వెళ్తే బెయిల్ సిద్ధం.. మాయమైన బియ్యానికి జవాబెప్పుడు..?



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 3 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**
సూర్యాపేట జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవహారంలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలు జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. 2022--23 సీజన్ నుంచి వివిధ వ్యవసాయ సీజన్లకు సంబంధించి ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ బియ్యం నిల్వలు, ధాన్యం లెక్కల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారని సమాచారం. రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు అప్పగించి, దానిని బియ్యంగా మార్చి ప్రజా పంపిణీ వ్యవస్థకు అందించాల్సి ఉండగా, కొందరు మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలించి అక్రమంగా లాభాలు పొందారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక బృందాలు, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో మెరుపు తనిఖీలు చేపట్టి రికార్డులు, ధాన్యం నిల్వలు, సీఎంఆర్ బియ్యం లెక్కలను పరిశీలిస్తున్నారు. గత రెండు వారాలుగా కొనసాగుతున్న తనిఖీల్లో పలు మిల్లుల్లో నిల్వలు, రికార్డుల మధ్య భారీ వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టినట్లు సమాచారం. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యం పెండింగ్‌లో ఉండటంతో ప్రభుత్వం మిల్లర్లకు గడువు ఇచ్చినప్పటికీ పలువురు స్పందించకపోవడంతో, మిల్లుల్లో వాస్తవంగా ఎంత ధాన్యం, ఎంత బియ్యం నిల్వ ఉందో గుర్తించేందుకు అధికారులు ప్రత్యేక తనిఖీలు ప్రారంభించారు. సూర్యాపేట మండలంలోని గాంధీనగర్ పరిధిలోని వజ్ర వికాస్ రైస్ మార్ట్, వజ్ర రైస్ కార్పొరేషన్‌లలో రూ.73 కోట్ల విలువైన 29,197 టన్నులు, కాసరబాదలోని శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లులో రూ.27.23 కోట్ల విలువైన 11,400 టన్నులు, రవి కృష్ణ రైస్ మిల్లులో రూ.47.62 కోట్ల విలువైన సీఎంఆర్ బియ్యం నిల్వల్లో వ్యత్యాసాలు గుర్తించినట్లు సమాచారం.



తిరుమల గిరి మండలం అన్నారంలోని ఏఎస్ఆర్ రైస్ మిల్లులో రూ.46 కోట్ల విలువైన 19,701 టన్నులు, జేపీ రైస్ మిల్లులో రూ.11.67 కోట్ల విలువైన 4,886 టన్నులు, చింతలపాలెం మండలం దొండపాడులోని శివసుబ్రహ్మణ్యేశ్వర మోడ్రన్ రైస్ మిల్లులో రూ.4.89 కోట్ల విలువైన 2,050 టన్నులు, సూర్యాపేటకు చెందిన శివసాయి రైస్ మిల్లులో సుమారు రూ.13 కోట్ల విలువైన 2,900 టన్నుల సీఎంఆర్ బియ్యం నిల్వలకు సంబంధించి అధికారులు పరిశీలన చేపట్టినట్లు తెలిసింది. ఇప్పటివరకు గుర్తించిన వ్యత్యాసాల విలువ వందల కోట్ల రూపాయలకు చేరినట్లు సమాచారం ఉండగా, 2022 నుంచి 2026 వరకు వివిధ సీజన్లకు సంబంధించిన ధాన్యం, బియ్యం నిల్వలపై ప్రత్యేక బృందం సమగ్రంగా విచారణ కొనసాగిస్తోంది. కొన్ని మిల్లులను సీజ్ చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం ఉన్నప్పటికీ, కేసులు నమోదైనా ప్రజా పంపిణీ వ్యవస్థకు చేరాల్సిన బియ్యం ఎక్కడికి వెళ్లింది..? ప్రభుత్వానికి అప్పగించాల్సిన వేల టన్నుల సీఎంఆర్ బియ్యం ఎందుకు అందుబాటులో లేదు..? ప్రజాధనానికి జరిగిన నష్టాన్ని ఎవరి నుంచి రికవరీ చేస్తారు..? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా విచారణలో అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మాయమైన బియ్యం విలువను వడ్డీతో సహా వసూలు చేయాలని, ప్రజాధనాన్ని కాపాడేందుకు పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సీఎంఆర్ అక్రమాలపై కొనసాగుతున్న ప్రత్యేక తనిఖీలు, విచారణలో ఇంకా ఎన్ని నిజాలు వెలుగులోకి వస్తాయో, మొత్తం ఎంత మేర ప్రజాధనం నష్టపోయిందో, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

# హైకోర్టు ఆదేశాలున్నా.. పంచాయతీ కార్యాలయానికి తాళాలేనా..?

## గ్రామాభివృద్ధికి అడ్డంకులు తొలగించాలంటూ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తుల ధర్నా

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 3 ప్రజా న్యూస్ నెట్‌వర్క్**
సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం గుడిమల్కాపురం గ్రామపంచాయతీ నూతన కార్యాలయ భవనాన్ని వెంటనే తెరిచి గ్రామ పాలనకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు సోమవారం చింతలపాలెం మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనం అందుబాటులో లేకపోవడంతో పాలకవర్గం గ్రామాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించి పాలకవర్గానికి అందుబాటులోకి తీసుకురావడం లేదని ఆరోపించారు. పాలకవర్గ కార్యకలాపాల్లో జోక్యం చేసుకోవద్దంటూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని, ఆ ఆదేశాలను అధికారులు గౌరవించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత 18 నెలలుగా గ్రామపంచాయతీ అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ, గ్రామ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. పాలకవర్గం ఏర్పడి సుమారు ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ గ్రామపంచాయతీ కార్యదర్శి నుంచి అవసరమైన సహకారం అందడం లేదని సర్పంచ్, వార్డు సభ్యులు ఆరోపించారు. గ్రామపంచాయతీ కార్యాలయం అందుబాటులో లేకుండా గ్రామాభివృద్ధికి సంబంధించిన తీర్మానాలు ఎలా చేయాలి..? ప్రజా సమస్యలపై సమావేశాలు ఎలా నిర్వహించాలి..? అభివృద్ధి కార్యక్రమాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలి..? అని వారు ప్రశ్నించారు. గ్రామ ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గం ప్రజలకు సేవలు అందించేందుకు, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసేందుకు అవసరమైన సహకారం అందించాల్సిన అధికారులు కార్యాలయ భవనాన్ని తెరవకుండా జాప్యం చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. హైకోర్టు ఆదేశాలను గౌరవించి నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనానికి వేసిన తాళాలను వెంటనే తెరిచి, సర్పంచ్‌తో పాటు పాలకవర్గం గ్రామాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు అధికారులు పూర్తి స్థాయిలో సహకరించాలని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని, నూతన కార్యాలయ భవనాన్ని గ్రామ పాలనకు అందుబాటులోకి తీసుకురావాలని సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు కోరారు.

# ఎల్‌సీ తీసుకోకుండానే ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కించారా..?

## నిర్లక్ష్యానికి ప్రైవేటు వ్యక్తి చేయి-కాలు బలి..!

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 3 ప్రజా న్యూస్ నెట్‌వర్క్**
సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో విద్యుత్ మరమ్మతుల సమయంలో జరిగిన ప్రమాదం ఓ ప్రైవేటు వ్యక్తి జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిందని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం, విద్యుత్ లైన్‌కు సంబంధించి ఎల్‌సీ (లైన్ క్లియర్) తీసుకోకుండానే సంబంధిత లైన్‌మెన్ ఓ ప్రైవేటు వ్యక్తిని ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కించి విద్యుత్ మరమ్మతులు చేయిస్తుండగా అతడు విద్యుత్ షాక్‌కు గురయ్యాడని తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడికి చికిత్సలో భాగంగా ఒక చేయి, ఒక కాలు తొలగించాల్సి వచ్చిందని, దీంతో బాధితుడి జీవితం పూర్తిగా మారిపోయిందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. విద్యుత్ మరమ్మతుల వంటి అత్యంత ప్రమాదకరమైన పనుల్లో భద్రతా నిబంధనలు పాటించకుండా ప్రైవేటు వ్యక్తితో పని చేయించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. లైన్‌మెన్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘోర ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ బాధితుడి కుటుంబ సభ్యులు గరిడేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తీవ్రంగా గాయపడి శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుడికి అవసరమైన వైద్య సహాయం, ఆర్థిక పరిహారం అందించి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. బాధిత కుటుంబం చేస్తున్న ఆరోపణలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేశారు.

# పోయిన మొబైళ్లకు పోలీసుల భరోసా.. బాధితులకు 102 ఫోన్ల అందజేత

## రూ.20 లక్షల విలువైన మొబైళ్ల రికవరీ.. 14వ విడతలో బాధితులకు అప్పగింత

## ఏడాది కాలంలో 1,846 ఫోన్ల రికవరీ.. ప్రజా భద్రతే పోలీసుల లక్ష్యం: ఎస్పీ నరసింహ



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 3 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**
సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సెల్‌ఫోన్ రికవరీ మేళాలో వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు పోగొట్టుకున్న సుమారు రూ.20 లక్షల విలువైన 102 మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేసి జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ చేతుల మీదుగా సంబంధిత యజమానులకు అందజేశారు. జిల్లాలో బాధితులకు మొబైల్ ఫోన్లను తిరిగి అందజేయడం ఇది 14వ సారి కాగా, గత ఏడాది కాలంలో మొత్తం 1,846 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.4 కోట్ల 80 లక్షల విలువైన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో నిత్యావసర వస్తువుగా మారిందని, కమ్యూనికేషన్, ఆన్‌లైన్ విద్య, బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, సామాజిక మాధ్యమాలతో పాటు అనేక ఆర్థిక అవసరాలకు మొబైల్‌ను వినియోగిస్తున్నారని తెలిపారు. మొబైల్ పోగొట్టుకోవడం వల్ల కేవలం ఫోన్ విలువ మాత్రమే కాకుండా అందులో నిక్షిప్తమైన వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఫొటోలు, సామాజిక మాధ్యమ ఖాతాలకు సంబంధించిన సమాచారం కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. మొబైల్ ఫోన్ పోయిన లేదా దొంగిలించబడిన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించడంతో పాటు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేసి మొబైల్‌ను బ్లాక్ చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ సైబర్ వారియర్స్, ఐటీ కోర్ సిబ్బంది, పోలీసు సిబ్బంది సమన్వయంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేస్తున్నారని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అత్యాశ, దురాశలకు పోకుండా సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, తక్కువ వడ్డీ రుణాలు, తక్కువ సమయంలో అధిక లాభాలు, బహుమతులు వచ్చాయంటూ వచ్చే అపరిచిత సందేశాలు, ఫోన్ కాల్స్‌ను నమ్మి డబ్బులు పంపవద్దని సూచించారు. సీబీఐ, సీఐడీ వంటి దర్యాప్తు సంస్థల పేర్లు చెప్పి డిజిటల్ అరెస్ట్ చేస్తామని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసే మోసగాళ్ల మాటలను నమ్మవద్దని, అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రహదారి ప్రయాణాల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అవసరమన్నారు. మహిళలు, బాలల భద్రతకు జిల్లా పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని, మాదకద్రవ్యాలు, గంజాయి వంటి ప్రమాదకర అలవాట్ల నుంచి యువతను దూరంగా ఉంచేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల భద్రత, రక్షణ కోసం పోలీసులు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారని, తమ ప్రాంతాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, నేరాలకు సంబంధించిన సమాచారం పోలీసులకు అందించాలని తెలిపారు. సమాజంలో చెడును ప్రశ్నించి పోలీసులకు సమాచారం అందించే ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీసుతో సమానమని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. పోయిన మొబైల్ ఫోన్లు తిరిగి దొరకవని భావించిన బాధితులు సాంకేతికతను వినియోగించి ఫోన్లను గుర్తించి తమకు అప్పగించిన జిల్లా ఎస్పీ, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. మొబైల్ ఫోన్ల రికవరీలో కృషి చేసిన ఐటీ కోర్ సిబ్బంది, పోలీసు స్టేషన్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఐటీ కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటీ కోర్ సిబ్బంది, పోలీసు సైబర్ వారియర్స్, మొబైల్ ఫోన్లు పొందిన బాధితులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం అందించే లాభదాయక పంట – ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్



**చింతపల్లి, ఆగస్ట్ 03, ప్రభ న్యూస్ నెట్వర్క్:**
నల్లగొండ జిల్లా ఉద్యానవన (హార్టికల్చర్) శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా చింతపల్లి మండలం గడియ గౌరారం x రోడ్ వద్ద రైతు అల్వాల యాదయ్య పొలంలో ఆయిల్ ఫామ్ మొక్కలను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సంబంధిత అధికారులతో కలిసి నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ఆయిల్ ఫామ్ సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తోందన్నారు.వంటనూనెల దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించడంతో పాటు రైతులకు స్థిరమైన, అధిక ఆదాయాన్ని అందించే పంటగా ఆయిల్ ఫామ్ నిలుస్తుందని పేర్కొన్నారు.ఆయిల్ ఫామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలం పాటు నిరంతర ఆదాయం లభిస్తుందని, మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహం కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. నాణ్యమైన మొక్కల పంపిణీ, సాంకేతిక సలహాలు, సాగు నిర్వహణలో అవసరమైన మార్గదర్శకాలను ఉద్యానవన శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్నదని చెప్పారు. నీటి వనరులు ఉన్న రైతులు ఆయిల్ ఫామ్ సాగు వైపు మొగ్గు చూపితే భవిష్యత్తులో ఆర్థికంగా మరింత బలపడతారని ఎమ్మెల్యే సూచించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటూనే, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, సాగునీటి సౌకర్యాల మెరుగుదల, వ్యవసాయానికి అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి, రైతు సంక్షేమానికి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.దేవరకొండ నియోజకవర్గంలో కూడా వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా మారాలంటే సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ అవకాశాలు ఉన్న ప్రత్యామ్నాయ పంటలను కూడా రైతులు సాగు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులతో కలిసి మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల గిరి, చింతపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జటావత్ హరినాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు శివారులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 3 ప్రజా న్యూస్ నెట్‌వర్క్**
సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్లూరు గ్రామ శివారులో అందర్--బాహర్ పేకాట నిర్వహిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ.1,500 నగదు, మూడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గోపాల్ రెడ్డి తెలిపారు. పట్టుబడిన వ్యక్తులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# డీఎస్సీ పేపర్ లీకేజీపై మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి: దాడిశెట్టి రాజా



**తుని, ఆగస్టు 3 ప్రజా న్యూస్ నెట్వర్క్:**
కాకినాడ జిల్లా తునిలో వైఎస్ఆర్సిపి తుని నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దాడిశెట్టి రాజా మాట్లాడుతూ. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని, మెరిట్ జాబితాల నిర్వహణలో పారదర్శకత లోపించిందని ఆరోపిస్తూ ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వహించి మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా డిమాండ్ చేశారు. లేని పక్షంలో తుని నియోజకవర్గంలో రిలే దీక్షలు చేపడతామని హెచ్చరించారు.కాకినాడ జిల్లా తునిలో వైఎస్సార్‌సీపీ తుని నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాడిశెట్టి రాజా మాట్లాడుతూ, డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా న్యాయస్థానాలు త్వరితగతిన విచారణ పూర్తి చేసి తీర్పు ఇవ్వాలని కోరారు.క్రీడా కోటా, వికలాంగుల కోటాలకు సంబంధించిన నకిలీ ధ్రువపత్రాల వినియోగం, మెరిట్ జాబితాల విడుదలలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. కొందరికి ముందుగా ఉద్యోగాలు ఇచ్చి, అనంతరం వాటిని రద్దు చేయడంతో బాధితులు కోర్టులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.రాష్ట్రంలో రెండేళ్ల పాలనలో ప్రజా సమస్యల కంటే ప్రచార కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులపై కేసుల నమోదు, రాజకీయ పరిణామాల నిర్వహణపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కొన్ని ఘటనల్లో వీడియోలు వెలుగులోకి రావడంతో వాస్తవాలు బయటపడ్డాయని పేర్కొన్నారు.సామాజిక మాధ్యమాలు, ప్రభావశీలుల ద్వారా యువత, నిరుద్యోగులపై ప్రభావం చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ విభిన్న అభిప్రాయాలను అణిచివేయకుండా ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు.డీఎస్సీ నియామకాలు, క్రీడా కోటా అర్హతలు, ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తుని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థుల ప్రాణాల కంటే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల లాభాలే ముఖ్యమా..?

## ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి.



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 3 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**
సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల బస్సులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయనే ఆరోపణలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, ఫిట్‌నెస్ లేని బస్సులను వెంటనే సీజ్ చేయడంతో పాటు సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా రవాణా శాఖ అధికారి పురుషోత్తం రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింహాద్రి మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. కొన్ని స్కూల్ బస్సుల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక సంఖ్యలో విద్యార్థులను తరలించడం, కనీస భద్రతా ప్రమాణాలను పాటించకపోవడం, బస్సుల నిర్వహణను నిర్లక్ష్యం చేయడం వంటి అంశాలు అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు పాఠశాల బస్సుల్లో ప్రయాణిస్తున్న నేపథ్యంలో ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు సంబంధిత పాఠశాలల యాజమాన్యాలతో పాటు పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థుల ప్రాణ భద్రత కంటే యాజమాన్యాల లాభాలే ముఖ్యమా అనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రైవేటు పాఠశాలల బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, బీమా, పర్మిట్లు, వాహనాల నిర్వహణ పరిస్థితి, డ్రైవర్ల అర్హతలు, ఇతర చట్టబద్ధ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. ఫిట్‌నెస్ లేని బస్సులను తక్షణమే రోడ్లపై తిరగకుండా నిలిపివేసి సీజ్ చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రవీణ్, అంజి, ఉపేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.